
దాచేపల్లి : తుఫాన్‌కి నేలకొరిగిన వరి పొలంలో రైతు


బొలాపల్లి : పేరూరుపాడు గ్రామానికి చెందిన జ్యోతికి పురిటి నొప్పులు రావటంతో ఎక్స్‌కవేటర్ సాయంతో వాగును దాటిస్తున్న అధికారులు


పిడుగురాళ్ల వద్ద నీట మునిగిన మిరప పొలంలో రైతులు


దుర్గి : కంచరగుంటలో నీట మునిగిన మొక్కజొన్న

మొంథా బీభత్సం




మాచర్ల : ముటుకూరు వద్ద నీట మునిగిన బొప్పాయి తోట


చిలకలూరిపేట పునరావాస కేంద్రంలో బిస్కెట్ ప్యాకెట్లు అందజేస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా


వినుకొండ : నిర్మల స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో జేసీ సూరజ్ ధనుంజయ్

మొంథా ముంచేసింది. వాతావరణశాఖ హెచ్చరించినట్లుగానే బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిశాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి గాలుల తీవ్రత పెరుగుతూ వచ్చినా, రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వీచిన పెనుగాలులు, వర్షం బీభత్సాన్ని సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో కుండ పోత వర్షం కురిసింది. ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. భారీగా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా రహదారులపై ప్రవహించాయి. పొలాలు చెరువులను తలపించాయి. చేతికి అందివచ్చిన పంటలు చాలావరకు ముంపునకు గురయ్యాయి. మంగళవారమే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించగా బుధవారం వారంతా అక్కడే ఆశ్రయం పొందారు. ఇక మునిగిన పొలాలను, పునరావాస కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. బుధవారం వర్షంలోనే ఎక్కడికక్కడ నేలకూలిన చెట్లను తొలగించి రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. దీంతో పాటు విద్యుత్ స్తంభాలను నిలబెట్టి కరెంట్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేశారు.

చిలకలూరిపేటలో 209 మీమీ వర్షం

- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, జేసీ పర్యటన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తుఫాన్ ప్రభావంతో జిల్లాలో అత్యధికంగా చిలకలూరిపేట మండలంలో 209 మీమీ వర్షపాతం నమోదైంది. కాగా నాదెండ్లలో 16.24, యడ్లపాడులో 15.48, శావల్యాపురంలో 11.80, బొల్లాపల్లిలో 11.26, నరసరావుపేటలో 10.50, కారంపూడిలో 10.22, పిడుగురాళ్లలో 10.06 వర్షపాతం నమోదుకాగా తక్కువగా నకరికల్లు మండలంలో 4.36 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం కురిసిన భారీ వర్షాలతో పట్టణాలు, పల్లెల్లో పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రాత్రి వేళ భారీ వర్షాలతో ఇళ్లల్లోకి నీరు ప్రవేశించి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటు రాత్రంతా గడిపారు. అధికార యంత్రాంగం వెనువెంటనే స్పందించి ముంపు ప్రాంతాల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించింది. ముంపుగురైన ప్రాంతాల్లో వరద నీరు బయటకు పంపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వాగుల చప్టాలకు అడ్డుపడిన చెట్లు, వ్యర్థాలను తొలగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. పట్టణాల్లో యాచకులకు, పేదలకు స్వచ్ఛంద సేవా సంస్థల వలంటీర్లు ఆహారపు పొట్లాలను పంపిణీ చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా చిలకలూరిపేట, నరసరావుపేట పరిధిలో ముంపునకు గురైన ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. తిమ్మాపురం వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవాహాన్ని పరిశీలించారు. జేసీ సూరజ్ ధనుంజయ్ వినుకొండ, నూజెండ్ల ప్రాంతాల్లో పర్యటించి వరద సహాయక చర్యలను పరిశీలించారు. నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, చిలకలూరిపేటలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్లలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సహాయక చర్యలను పరిశీలించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు కలెక్టర్, ఎస్పీ బి.కృష్ణారావు సమీక్షించి అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ అప్రమత్తం చేశారు.


జాతీయ రహదారిపై వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా


మునిగిన పంట వద్ద రైతు దిగాలు


రొంపిచర్ల : అచ్చయ్యపాలెంలో పునరావస కేంద్రంలో బాధితులు

55,935 ఎకరాల్లో పంట నష్టం

భారీవర్షాలతో జిల్లాలో 55,935 ఎకరాల్లో పంటలకు నష్ట వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా 43,750 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. వరి 2,500, మొక్కజొన్న 875, కంది 450, మినుము 200, జూట్ 200 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ లెక్కగట్టింది. మిరప, కూరగాయలు, బొప్పాయి పంటలు 5,208 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అంచనా వేసింది. అత్యధికంగా మిరప పంటకు నష్టం వాటిల్లింది. పూర్తి స్థాయిలో పంటల నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది.

నేటి నుంచి పాఠశాలలు

అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

గుంటూరు(విద్య): తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులుగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం శాంతించింది. దీంతో గురువారం నుంచి యథావిధిగా విద్యాసంస్థలను పునః ప్రారంభించాలని అధికారులు ప్రకటించారు. అయితే పాఠశాలలు ప్రారంభించే సమయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యయులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. పాఠశాలల ఆవరణలో విద్యుత్ వైర్లు తెగిపడటం, చెట్ల కొమ్మలు విరిగిపోవడం ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బలహీనంగా ఉన్న శ్లాబుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యాశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని పాఠశాలల ప్రాంగణాల్లో వర్షపు నీరు చేరిన నేపథ్యంలో పారిశుధ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వర్షాలు తగ్గిన తర్వాత అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై సూచనలు ఇవ్వాలని డీఈవోలు ప్రకటించారు.

రైతుల వెన్ను విరిచిన తుఫాన్

- పలు ప్రాంతాల్లో అత్యంత భారీగా వర్షం
- రహదారులపై ఉధృతంగా ప్రవహించిన వాగులు
- గాలులకు పడిపోయిన వృక్షాలు, కరెంటు స్తంభాలు
- వర్షంలోనూ సహాయక చర్యల్లో అధికార యత్రాంగం
- పునరావాస కేంద్రాల్లో వందలాది కుటుంబాలకు ఆశ్రయం
- నిజాంపట్నం హార్బర్‌లో కొనసాగుతున్న 3వ ప్రమాద హెచ్చరిక

నరసరావుపేట, గుంటూరు సిటీ, బాపట్ల, తెనాలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలపై విరుచుకుపడింది. మంగళవారం రాత్రి పెనుగాలులతో బీభత్సం సృష్టించిగా.. బుధవారం భారీ నుంచి అతిభారీగా వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతవాసులు రాత్రంతా చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. మూడు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలుల ధాటికి ఖరీఫ్ రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. చేలన్నీ చాపలా నేలపై పరుచుకుపోతే, అటు లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు తీరని నష్టం ఏర్పడింది. గెలలుచేతికొచ్చే తరుణంలో అరటి చెట్లు విరిగిపడటంతో రైతు వెన్ను విరిగింది. తమలపాకు, బొప్పాయి, కూరగాయల తోటల రైతులకూ భారీ నష్టం ఏర్పడింది. కంకులు వచ్చి, పచ్చని రంగులో వరి కళకళలాడుతుంటే తుపాన్ వరి రైతు ఆశలపై నీళ్లు చల్లింది. పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ కింద వరి సాగవుతుంటే బాపట్ల జిల్లాలో 3,79,997 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 1,84,190 ఎకరాలు సాగులో ఉంది. అయితే బాపట్ల జిల్లాలో 40 శాతం, గుంటూరు జిల్లాలో 20 శాతానికిపైగా పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వర్షానికంటే గాలులకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. చాపలా పరచుకున్న చేలు ఎక్కడ చూసినా పడమర నుంచి తూర్పుకు వాలిపోయి కనిపించాయి. మరి కొన్ని చేలల్లో సుడిగాలులు వీచినట్లు వరి చిందరబందరగా పడిపోయింది. గింజ కూడా దక్కకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లకు, (మిగతా 6వ పేజీలో)


రాజుపాలెం : అనుపాలెం వద్ద వాగులో కొట్టుకు పోతున్న యువకుడిని కాపాడుతున్న రూరల్ సీఐ కిరణ్ కుమార్, పోలీసు సిబ్బంది


క్రోసూరు: ఉయ్యందన - అనంతవరం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఫోన్ కాల్స్‌తో ఆరా..

హలో.. మేము ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉందికదా! మీరు సురక్షితంగా ఉన్నారా? మీ ప్రాంతం లో పునరావాస కేంద్రాలలో సక్రమంగా సేవలందుతున్నాయా? అధికారులు అంతా అందుబాటులో ఉన్నారా? మీకు ఏదైనా ఇబ్బంది అని సహాయం కోరితే వెంటనే స్పందిస్తున్నారా? అంటూ ఫోన్ కాల్స్‌తో బాధితులను ఆరాతీశారు. మరోపక్క పోలీస్ సిబ్బంది కూడా 100 నంబరు నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్‌తో బాధితుల రక్షణపై ప్రశ్నించారు.


వెల్దుర్తి : శిరిగిరిపాడు వజ్రాలపాడు చెట్టు పెంట తండా బాధితులను తాళ్ల సహాయంతో ఇళ్ల నుంచి బయటకు తీసుకొస్తున్న సహాయ సిబ్బంది


కృష్ణానదిలో చిక్కుకున్న మత్స్యకారుడిని ఒడ్డుకు తీసుకు వస్తున్న పోలీసులు


నకరికల్లు సమీపంలో రహదారిపై కూలిన వృక్షాలు తొలగింపు


నరసరావుపేట : ముంపునకు గురైన సత్తెనపల్లి రహదారి


పిడుగురాళ్ల ప్రాంతంలో దెబ్బతిన్న అరటితోట


మాచర్ల : వరద నీటితో పొంగిపొర్లుతున్న ఎత్తిపోతల జలపాతం

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం


జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, సీఈఓ జ్యోతిబసు

- ప్రకటించిన వైసీపీ జడ్పీటీసీలు
- ఎంపీపీలను దించుతున్నందుకు ప్రతీకారం
- కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా


అవిశ్వాసం పెట్టబోతున్నట్లు వెల్లడిస్తున్న వైసీపీ జడ్పీటీసీలు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

'మేము జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం పెట్టబోతున్నాం. అలా అని మాకు చైర్‌పర్సన్‌తో గొడవలు లేవు. ముప్పాళ్ల, మాచర్ల ఇతర మండలాల్లో వారికి(కూటమి) ఒక్క సీటు కూడా లేకుండానే పదవిలో ఉన్న వారిని దించేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. కిడ్నాప్‌లు చేస్తున్నారు.. కేసులు పెడుతున్నారు.. ఏమి చేయాలో అన్నీ చేస్తున్నారు. అందుకని మేము కూడా జడ్పీ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని అనుకుంటున్నాం. ఎప్పుడూ.. ఎలా అనేది మరలా చెబుతాం.' అని వైసీపీకి చెందిన రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడిన అనంతరం వైసీపీ (మిగతా 6వ పేజీలో)

ఎలక్ట్రీషియన్లకు జర్మన్‌లో ఉద్యోగ అవకాశాలు

గుంటూరు, అక్టోబరు 29: జర్మనీలో ఎలక్ట్రీషియన్లకు ఉద్యోగాలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓం కాపీస్ (ఓఎం సీఏపీఐఈఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఐటీఐ, డిప్లొమా విద్యా అర్హతతో 18 నుంచి 30 ఏళ్ల మధ్య గల పురుష అభ్యర్థులు జర్మనీలో పనిచేయడానికి వచ్చే నెల 2వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలని సూచించారు. జీతం నెలకు 2,600 నుంచి 2,700 యూరోలు (సుమారు రూ.2.5 నుంచి 2.7 లక్షలు) ఉంటుందన్నారు. రెండేళ్ల కాంట్రాక్ట్ ఉంటుందని వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' విజేతలు వీరే..

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి జరిగే 3వ ప్రపంచ తెలుగు మహా సభల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన 'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' పోటీల విజేతలను పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా రామ్‌శేషు (నెల్లూరు), సునీల్ (అమలాపురం), సరసి(హైదరాబాదు) నిలిచినట్టు పేర్కొన్నారు. ప్రముఖ కార్టూనిస్టు హరి మాట్లాడుతూ విజేతలకు ప్రపంచ తెలుగు మహా సభల ప్రధాన వేదికపై బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. ఎంపికైన కార్టూన్లను వేదిక వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు.

నేడు తుళ్లూరు సీఆర్డీఏలో జాబ్ మేళా

తుళ్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో గురువారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనుంది. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు గ్రామంలోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు లేదా శ్రీకర్ 99634 25999 నంబరుకు కాల్ చేయవచ్చు. జాబ్ మేళాలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నైపుణ్యం పోర్టల్ నమోదు చేసుకోవాలని సీఆర్డీఏ కార్యాలయం కోరింది.

రాజధాని రైతుల ప్లాట్లపై అసత్యప్రచారం

● తుది దశకు చేరుకున్న ప్రక్రియ: మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులను, ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి సచివాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. నాలుగు నెలల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు 29644 మంది రైతులకు సంబంధించిన 34192.19 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఇంకా 991 మంది రైతులకు 719.04 ఎకరాలకు ప్లాట్లు కేటాయించాల్సి ఉందన్నారు. 69421 ప్లాట్లకు 60980 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. వీటిలో కోర్టు కేసుల్లో 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు, ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందినవి 1170 ప్లాట్లు, వివాదాల్లో 450 మందికి చెందినవి 1889 ప్లాట్లు, పీవోటీ కేసుల్లో 78 మంది రైతులుకు చెందినవి 208 మంది పాట్లు, దేవదాయశాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందినవి 69 ప్లాట్లు, లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందినవి 337 ప్లాట్లు, ఎన్ఆర్ఐలు 210 మందికి చెందినవి 444 ప్లాట్లు ఉన్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 231.03 కోట్ల కౌలు చెల్లించామన్నారు. 484 మంది రైతులకు రూ.3.15 కోట్లు వివిధ సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

● తీర ప్రాంతాల్లోనూ కొనసాగుతోన్న పనులు
● సత్ఫలితాలనిచ్చిన ముందస్తు ప్రణాళికలు
● క్షేత్రస్థాయిలో పర్యటించిన టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్



గుంటూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



రేపల్లెలో సమీక్షిస్తున్న టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎక్కడికక్కడ నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుంటూరుతో పాటు పల్నాడు, బాపట్ల సర్కిల్స్ పరిధిలో ఓ అండ్ ఎం అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సక్సెస్ అయ్యారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని చెప్పవచ్చు. తుఫాన్ ప్రభావంతో భారీ వృక్షాలు, విద్యుత్ పోల్స్ తీగెలు తెగిపడిపోతే వెంటనే పునరుద్ధరించేందుకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున ముందస్తు ఏర్పాట్లు చేశారు. అవసరమైన ప్రొక్లెయినర్లు, వాహనాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్‌లు, ఇతర సామగ్రిని స్టోర్స్‌లో అందుబాటులో ఉంచుకున్నారు. ఎటువంటి విపత్తులు సంభవించినా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబరు 1912తో పాటు గుంటూరు, పల్నాడు, సీఆర్‌డీఏ, బాపట్ల సర్కిల్స్‌లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు.

తెగిపడిపోయిన తీగలు, కూలిన వృక్షాలు

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు పెద్ద ఎత్తున వీచాయి. జిల్లా కేంద్రం గుంటూరులో పెద్దగా తుఫాన్ ప్రభావం చూపనప్పటికీ రూరల్ ప్రాంతాల్లో ముఖ్యంగా బాపట్ల సర్కిల్, పల్నాడు సర్కిల్స్‌లో ప్రభావం చూపింది. దాంతో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, బాపట్ల, రేపల్లె, కొల్లూరు, కొల్లిపర మండలాలతో పాటు లంక గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడం, వృక్షాలు నేలకూలటంతో విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. అలానే పల్నాడు సర్కిల్ పరిధిలోని సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట, ముప్పాళ్ళ మండలం, రెంటచింతల, మాచవరం వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఇక సీఆర్డీఏ పరిధిలోనూ అక్కడక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. క్షేత్రస్థాయిలో ఓఅండ్ఎం సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగానే విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు అధికారులు తెలియజేశారు. బాపట్ల, పల్నాడు సర్కిల్స్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు బుధవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ అధికారుల బృందంతో పర్యటించారు. ప్రధానంగా బాపట్ల సర్కిల్ పరిధిలోని రేపల్లె మండల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఒక వైపు జాగ్రత్తలు పాటిస్తూనే విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా గుంటూరు నుంచి కూడా ప్రత్యేక అధికారులను బాపట్ల సర్కిల్ పరిధిలోని లంక ప్రాంతాలకు కేటాయించారు. మొత్తానికి తుఫాన్ నష్టంపై ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో ఎన్ని పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతిన్నాయి, ఎంత నష్టం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు.

తెలంగాణ జాలరిని రక్షించిన బెల్లకొండ పోలీసులు



జాలర్‌ను సురక్షితంగా తీసుకు వచ్చిన పోలీసులు

బెల్లంకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో కృష్ణా నదిలో చేపలు వేటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించినా.. వినకుండా వెళ్లిన జాలరిని పోలీసులు బుధవారం రక్షించారు. వివరాల్లోకి వెళితే తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, చింతలపాలెం మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన పరసగాని శ్రీను మిషన్ బోటు వేసుకొని తన స్నేహితులతో కలసి చేపల వేటకు మంగళవారం రాత్రి కృష్ణా నదిలోకి వెళ్లాడు. వేట కొనసాగిస్తుండగా మిషన్ చెడి పోవడంతో బోటు స్టార్ట్ కాలేదు. తుఫాన్ అధికం కావడంతో.. ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో బుధవారం ఉదయం తోటి జాలర్ల సమాచారం మేరకు తెలంగాణ పోలీసులు పల్నాడు జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. సత్తెనపల్లి డీఎస్పీ ఆదేశాల మేరకు బెల్లంకొండ పోలీసులు సత్తెనపల్లి ఆర్డీవో, తహసీల్దార్ పర్యవేక్షణలో స్థానిక జాలర్ల సహకారంతో శ్రీను ఉన్న చోటును గమనించి అతన్ని సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ బెల్లంకొండ పోలీసులకు అభినందనలు తెలిపారు.

మొంథా తుఫాన్ గట్టెక్కాం : జేసీ



మాట్లాడుతున్న జేసీ భావన

రేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రమాదకరమైన ఘటనలు జరగలేదని, ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని జాయింట్ కలెక్టర్ భావన అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. రేపల్లె ప్రాంతంలో ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలవాలటం గృహాల చుట్టూ నీరు చేరటం తప్పా ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితి లేదన్నారు. ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం మండలంలోని పెనుమూడి పునరావాస కేంద్రాన్ని ఆమె సందర్శించి బాధితులను పరామర్శించారు. ఆర్డీఓ రామలక్ష్మి, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొంథా బీభత్సం

(5వ పేజీ తరువాయి)

వాగులకు దగ్గరా ఉన్న చేలల్లో అయితే నేలవాలిన వరిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో పొలాల్లోని నీటిని బయటకు తియ్యడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

అప్రమత్తంగా యంత్రాంగం

ఓ పక్క తుపాన్ ధాటికి పెనుగాలులు విరుచుకుపడుతుంటే, మరోపక్క చిమ్మచీకటి. వర్షం.. అయినా రోడ్లకు అడ్డుగా విరిగిపడిన చెట్లు, విద్యుత్తు లు స్తంభాలను తొలగించేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. చెట్లను పడినట్టే క్షణాల్లో కత్తిరించి పక్కకు తొలగించేశారు. విద్యుత్తు స్తంభాలను పక్కకు నెట్టేసి, అవకాశం ఉన్న వరకు తెగిన తీగలను సరిచేస్తూ రాత్రంతా శ్రమించారు. మరోపక్క పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరాతో పాటు భోజనం, అల్పాహారం అందించారు. ఆరోగ్య సిబ్బంది ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందించారు. విద్యుత్ శాఖ ముందే చెట్లను నరికేయడంతో చాలావరకు నష్టం తప్పింది. ప్రధాన లైన్లు దెబ్బతినడంతో లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు 24 గంటల సమయం పట్టింది. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. బుధవారం ఉదయం నుంచి తుపాన్ తీవ్రత తగ్గడం, గాలులు శాంతించాయి. దీంతో హార్బర్‌లో హెచ్చరిక తీవ్రతను తగ్గించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా కొన్నిచోట్ల చిరుగాలులు, వర్షం కొనసాగుతుండటం, వాతారణంలో పూర్తిగా మార్పులు రాకపోవడంతో తిరిగి 3వ ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

దారి దోపిడీ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు పక్కన సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్

నరసరావుపేట లీగల్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి), నరసరావుపేట, రొంపిచర్ల, వినుకొండ ప్రాంతాల్లో దారి దోపిడీలకు పాల్పడిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ ఎం.హనుమంతరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితులు పట్టణంలోని చీకటి కాలనీకి చెందిన దేవరకొండ భవాని ప్రసాద్, వరవకట్టకు చెందిన షేక్ సుభాని, ఎస్ ఆర్‌కేటీ కాలనీ చెందిన గుంజి శ్రీను, కోట సెంటర్‌కు చెందిన రావుట్ల పవన్ సాయి అలియాస్ పండు, కోసూరుకు చెందిన రంజాన్‌వలి, అచ్చంపేటకు చెందిన సమీర్ ఒక గ్రూపుగా ఏర్పడి ఈ నెల 23, 27వ తేదీలలో పలు దారి దోపిడీలకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. 23న నిందితులు రెండు మోటార్ సైకిళ్లపై.. నర్సరావుపేట నుంచి శావల్యాపురం వైపు వెళ్లి అక్కడ ఓ వ్యక్తి బైక్ ఆపి కొట్టి బంగారు ఉంగరం, సెల్‌ఫోను తీసుకెళ్లినట్లు చెప్పారు. అదే రోజు రొంపిచర్ల వైపు వచ్చి వడ్లమూరివారి పాలెం రోడ్డులో మరో వ్యక్తిని అలాగే బెదిరించి.. రూ వెయ్యి నగదు, సెల్ ఫోను దోచుకున్నారన్నారు. 27న వినుకొండ, రొంపిచర్ల మార్గాల్లో దారి దోపిడీలకు పాల్పడ్డారని తెలిపారు. కర్లకుంట గ్రామం రోడ్డులో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు ఆపి.. రూ.1000 నగదు, మెడలోని మంగళసూత్రం లాక్కెళ్లారని చెప్పారు. రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామానికి చెందిన బుట్టి సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో మంగళవారం నిందితులను.. రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలెం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. రూరల్ సీఐ రామకృష్ణ, రొంపిచర్ల ఎస్సై.. నిందితుల నుంచి బంగారు ఉంగరం, రూ.4 500 నగదు, మూడు స్మార్ట్ ఫోన్లు, మంగళసూత్రంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విపత్తుల నిర్వహణలో చంద్రబాబు తర్వాతే ఎవరైనా

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల నుంచి ప్రజల్ని కాపాడడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తర్వాతే ఎవరైనా అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ తుపాను తీవ్రతను పర్యవేక్షిస్తూ, రాష్ట్ర ప్రజలకు చిన్న ఇబ్బంది లేకుండా పనిచేశారన్నారు. ఎప్పటికప్పుడు తుపాను తీవ్రతను గమనిస్తూ, ఆర్టీజీఎస్ ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు, సమస్యల పరిష్కారానికి తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా మొంథా తీవ్రతపై సమీక్షించి, అధికారులకు సూచనలు, సలహాలు అందించారన్నారు. ప్రజలకు కష్టమొస్తే చంద్రబాబు నాయుడు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయరని, గతంలో రాష్ట్రంలో సంభవించిన ప్రకృతి విపత్తులను ఎంత సమర్థంగా ఎదుర్కొన్నారో తెలిసిందేనన్నారు.

త్రికోటేశ్వరస్వామి దేవస్థానం.. ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల నియామకాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.చంద్రశేఖరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టానికి లోబడి ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల హిందు అభ్యర్థులు ప్రకటన తేది నుంచి 20 రోజులులోగా దరకాస్తు చేసుకోవాలని తెలిపారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృత్తికా శుక్లా

చిలకలూరిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట నియోజకవర్గంపై ఎక్కువగా ఉందని కలెక్టర్ కృత్తికా శుక్లా తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆమె బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 89 మి.మీలుగా నమోదైందని తెలిపారు. జిల్లాలో అత్యధిక వర్షపాతం చిలకలూరిపేటలో 209 మి.మీలు అని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 22 చోట్ల వాగులు పొంగిపొర్లుతున్నాయని, వాహనాలను ట్రాఫిక్ డైవర్షన్ చేసి సురక్షితంగా తరలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చిలకలూరిపేటలో అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల వరద నీరు త్వరగా బయటికి వెళ్లిందని, నీరు తగ్గిన తర్వాత పట్టణంలో పారిశుధ్య కార్యకలాపాలు ప్రారంభిస్తామని చెప్పారు. ముఖ్యంగా మిర్చి, పత్తి వంటి పంటలకు నీరు ఎక్కువగా నిలిచిన ప్రదేశాల్లో నష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. పంటలపై పూర్తి సమాచారం గురువారానికి లభిస్తుందని వెల్లడించారు. పట్టణంలోని సుగాలి కాలనీ స్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి.. ఆహారపు పొట్లాలను కలెక్టర్ పంపిణీ చేశారు. వైద్య వసతులను పరిశీలించారు. అడ్డరోడ్డు సెంటర్ వద్ద పొంగిపొర్లుతున్న వర్షపు నీటిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి పరిశీలించారు. చిలకలూరిపేట నరసరావుపేట మార్గంలో లింగంగుంట్ల వద్ద కుప్పగంజి వాగు ప్రవాహ ఉధృతిని ఆమె పరిశీలించారు.

పెరుగుతున్న వరద ఉధృతి



4 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బ్యారేజి నుంచి దిగువకు 82,675 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల, మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 96,490 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 10.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతోందని, డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేశామని ఆయన చెప్పారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో బుధవారం అధికారులు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నాలుగు క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయ నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,845 క్యూసెక్కులు, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,232 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 65,077 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 3,97,077 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0926 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0926 ఎంయూల కరెంట్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 4 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 39,776 క్యూసెక్కులు, టేల్‌రేస్ చానల్ ద్వారా 7,157 క్యూసెక్కులు మొత్తం 46,933 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 46 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

(5వ పేజీ తరువాయి)

జడ్పీటీసీలు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్న కారణంగా ప్రతీకారం తీర్చుకునేందుకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రతిపాదించ బోతున్నట్లు వెల్లడించారు. తమకు 42 మంది సభ్యుల మద్దతు ఉందని ప్రకటించారు. పదవీ కాలం కేవలం 11 నెలలు మాత్రమే ఉందని, అంత తక్కువ సమయంలో పదవి మారినా..తాము ఏమీ చేయలేమన్న సంగతి కూడా తెలుసు నని వారు పేర్కొనడం గమనార్హం.

అంతా బాగుంటే కలెక్టర్‌ను కలవాలని

మొంథా తుపాను కారణంగా వైసీపీ జడ్పీటీసీల వ్యూహం దెబ్బ తిన్నట్లు తెలుస్తోంది. వాతావరణం బాగుంటే.. సర్వసభ్య సమావేశం ముగిసిన తర్వాత వైసీపీ జడ్పీటీసీలు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన లేఖను అందజేయాలని ఆలోచన చేశారు. ఈ విషయాన్ని కొద్దిరోజుల క్రితమే కొందరు లీక్ చేశారు. తుపాను ఆటంకంతో వైసీపీ జడ్పీటీసీల ప్రణాళిక పారలేదు. జడ్పీలో 54 మంది జడ్పీటీసీలున్నారు. ఎన్నికలకు ముందు 12 మంది సభ్యులు టీడీపీ లో చేరారు. ఒక వేళ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం ప్రతిపాదించాలంటే రెండింట మూడొంతుల మంది సంతకాలు చేయాలి. వైసీపీ జడ్పీటీసీలు చెబుతున్నట్లుగా గతంలో 42 మంది మద్దతు ఉండేది కానీ, ఈ మధ్య పూర్తి స్థాయిలో చీలికలు ఏర్పడినట్లు తెలుస్తోంది. మరో 15 మంది సభ్యులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ చెబుతున్నట్లు అవిశ్వాసం సంగతి మొదలు పెట్టకుండానే నవ్వులు పాలు కావచ్చన్న ప్రచారం బలంగా జరుగుతోంది.

సమావేశంపై మొంథా ప్రభావం

జడ్పీ సర్వసభ్య సమావేశంపై మొంథా తుఫాన్ ప్రభావం పడింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ఆరంభం కాగా ఆ సమయానికి రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి ఒక్కరే హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు తాటికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, బొల్లాపల్లి జడ్పీటీసీ సీఆర్ బీబిభాయ్, పెదనందిపాడు జడ్పీటీసీ కె.అన్నపూర్ణమ్మ, తెనాలి జడ్పీటీసీ ఉమా ప్రణతి, కో-ఆప్షన్ సభ్యుడు జాన్సన్‌సోమ్ మాత్రమే వచ్చారు. కోరం లేకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రకటించారు. త్వరలోనే సమావేశం తేదీని ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, పల్నాడు డీఆర్ఓ మురళి, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

గురజాల డివిజన్‌లో వర్షపాతం...

పిడుగురాళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో బుధవారం నమోదైన వర్షపాతం వివరాలను ఆర్డీఓ వీ మురళీకృష్ణ వివరించారు. మాచర్లలో 68.8మి.మీ., దుర్గిలో 78.2, వెల్దుర్తిలో 87.2, రెంటచింతలలో 50.2, గురజాలలో 72.2, దాచేపల్లిలో 58.4, పిడుగురాళ్లలో 100.6, కారంపూడిలో 102.2, మాచవరంలో 69.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా సగటున 76.4 మి.మీ. వర్షపాతం నమోదైందని ఆర్డీఓ తెలిపారు. గురజాల యోజకవర్గం వ్యాప్తంగా 301.0మి.మీ., మాచర్ల నియోజకవర్గం వ్యాప్తంగా 386.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ వివరించారు.

పంటల్లో నీటిని తొలగించండి..

మాచవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలవల్ల మండలంలోని గ్రామాల్లో సాగుచేస్తున్న వివిధ రకాల పంటల్లో నిల్వ ఉన్న వర్షపునీటిని బయటకు పంపాలని ఏవో రామమ్మ, ఉద్యానశాఖ అధికారి అంజలి రైతులకు సూచించారు. మాచవరంలో వీరు పర్యటించి పలు సూచనలు చేశారు కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రభాకరరెడ్డి, హనుమంతనాయక్, ఆషాబీ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావం తగ్గేదాకా వరికోతలు వద్దు..

పిడుగురాళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాలలో వ్యవసాయ అధికారి సంధ్యారాణి పంటలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో జానపాడు సమీపంలో నేలకొరిగిన వరిపైరును, పత్తిపంటను పరిశీలించారు. పొలంలో వర్షపునీటిని బయటకు పంపించాలని రైతులకు సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టేదాకా వరికోతలు చేపట్టవద్దని సూచించారు.

లోతట్టు ప్రాంత ప్రజలకు భోజనాల పంపిణీ

సత్తెనపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 3వ వార్డులో లోతట్టు ప్రాంత ప్రజలకు సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆహారం, మందులు ఉచితంగా అందించారు. తుఫాన్ కారణంగా నిరాశ్రయులై 31వ వార్డు అంబేద్కర్‌నగర్ ఎంపీయూ పాఠశాలలో ఉన్న వందమందికి దుప్పట్లు అందించారు.

వైపరీత్యాలను ప్రకృతి వ్యవసాయం తట్టుకుంటుంది

ముప్పాళ్ళ అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలను ప్రకృతి వ్యవసాయం తట్టుకుంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు అమలకుమారి అన్నారు. మండలంలోని నార్నెపాడులో ఏఓ శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆమె పంటపొలాలను పరిశీలించారు.

గర్భిణులను వైద్యశాలలకు తరలించాలి..

రాజుపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌ఎంలు వారి పరిధిలోని గర్భిణులను వైద్యశాలకు తీసుకురావాలని స్థానిక వైద్యులు రవితేజనాయక్ కోరారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, చౌటపాపాయపాలెం గ్రామాలలో రెండుమూడు రోజులలో కాన్పు అయ్యేవారిని ఆయన 104 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ గణపవరం, కొత్తూరు, చౌటపాపాయపాలెం సచివాలయాలలో తుఫాను సందర్భంగా జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజేశ్వరి పర్యవేక్షణలో సుమారు 100 మంది నిర్వాసితులకు వైద్యసిబ్బందితో మెడికల్ క్యాంపు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వసంతరావు, ఉ షారాణి, కరీముల్లా, అలేఖ్య, ప్రమీల, సరళ, సుజాత ఉన్నారు.

వర్షం కురిస్తే వైద్యశాలలో ఇబ్బందులే..

సత్తెనపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వర్షం కురిసిన ప్రతిసారి పలుచోట్ల నీరు కారుతోంది. పోర్టికోలో శ్లాబు పైభాగంలో వర్షపు నీరు కారుతోంది. వర్షపు నీటికి సిబ్బంది డబ్బాలను ఏర్పాటుచేస్తున్నారు. గర్భిణుల వార్డులో కూడా వర్షపు నీరు కారుతోంది.

విష జ్వరాలను అశ్రద్ధ చేయవద్దు

సత్తెనపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విషజ్వరాలను ప్రజలు అశ్రద్ధచేయవద్దని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు బుధవారం తెలిపారు. జ్వరాలు వచ్చినవెంటనే స్థానిక ఆరోగ్యకేంద్రాలను సంప్రదించాలన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

బెల్లంకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో మాచాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధులకు ఎమ్మెల్యే ప్రవీణ్ ఆదేశాల మేరకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్టు మాజీ ఎంపీటీసీ, టీడీపీ నేత గుడిసె కొండయ్య పేర్కొన్నారు.

కోగంటివారిపాలెంలో మెడికల్ క్యాంపు

అచ్చంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోగంటివారిపాలెంలో తుఫాన్ పునరావాసకేంద్రంలో బుధవారం అచ్చంపేట పీహెచ్‌సీ డాక్టర్లు మెడికల్ క్యాంపును ఏర్పాటుచేశారు. పల్నాడు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ మాధవిలత సందర్శించారు. పునరావాసకేంద్రంలో వలసకూలీలు 50మందికి పైగా ఉన్నారు. నిర్వాసితులకు టీడీపీ సీనియర్ నాయకుడు బోదెల సాంబిరెడ్డి సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. క్యాంపులో హెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, డాక్టర్ వీ రాంబాబు, ఆరోగ్య విస్తరణ అధికారి పీ వెంకటరావు, ఎంఎల్‌హెచ్‌పీ చిరంజీవి, హెచ్‌ఏ కబీర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. మండలంలోని రుద్రవరంలో కర్నూలు వలసకూలీలు ఏడు కుటుంబాలకు ఎంపీయూ పాఠశాలలో పునరావాసం కల్పించారు. వీరికి భోజన ఏర్పాట్లుచేసినట్టు డీటీ జానీబాషా తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.91 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 67,740 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, రెండు గేట్ల ద్వారా 34,206, మొత్తం 51,206 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధం

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సనిశెట్టి కోటేశ్వరరావుకు చెందిన కిరాణాదుకాణం మంగళవారం రాత్రి 12గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు కోటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. క్రోసూరు ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.పదిలక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

వ్యవసాయ అధికారుల పర్యటన

తుఫాన్ ప్రభావిత గ్రామాలైన పాటిబండ్ల, పొడపాడు, పెదకూరపాడు, లింగంగుంట్ల, ముస్సాపురంలలో సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బోయపాటి రవిబాబు, ఏవో జీ కృష్ణయ్యలు బుధవారం పర్యటించారు. పొలాలను పరిశీలించి రైతులు పలు సూచనలు చేశారు.

కాలనీలలో మాజీ ఎమ్మెల్యే కాసు పరిశీలన

పిడుగురాళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పట్టణ సమీపంలోని 27వ వార్డులోకి చేరిన వర్షపునీటిని బుధవారం మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరిశీలించారు. నీటమునిగిన ఇళ్లను పరిశీలించి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరారు. పలు ప్రాంతాలలో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు. స్థానిక వైసీపీ నేతలు వున్నారు.

ప్రభుత్వం అప్రమత్తతతో తప్పిన ముప్పు

గురజాలటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అప్రమత్తతతో తుఫాన్ నుంచి ప్రజలు బయటపడ్డారని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించిందన్నారు.

పూజారి శ్రీనివాసచార్యులు కన్నుమూత

దాచేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొందుగుల గ్రామానికి చెందిన నంద్యాల శ్రీనివాసచార్యులు(62) బుధవారం వేకువజామున కన్నుమూశారు. ఆయన గ్రామంలోని ఆంజనేయస్వామి, రామాలయాలకు పూజారి. ఆయన మృతికి ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు.



రజక కాలనీ రోడ్డులో కోతకు గురైన చప్టాను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, సీఐ వెంకట్రావు, ఏఈ రోహిణి



రజక కాలనీకి వెళ్లే మార్గంలో కోతకు గురైన చప్టా



కోనంకి చప్టా వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుబాబు, తదితరులు

ముంచిన మొంథా

● తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షం
● పొంగిన వాగులు
● రాకపోకలకు అంతరాయం
● తీవ్రంగా నష్టపోయిన పైర్లు



మాచవరం: గాంధీనగరం వద్ద చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు



దాచేపల్లి: వాగు వద్ద భద్రతా చర్యలు చేపడుతున్న పోలీసు కానిస్టేబుల్ అంజిరెడ్డి

పిడుగురాళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలలో నీటమునిగిన ప్రాంతాలలో నీటిని బయటకు పంపేందుకు అధికారులు సహాయకచర్యలు చేపట్టారు. రజకకాలనీ, బుడగజంగాల కాలనీ, కోనంకి చప్టా వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు సహాయకచర్యలు చేపట్టి కాలనీలోకి వచ్చిన వర్షపునీటిని బయటకు పంపేందుకు ప్రొక్లెయిన్‌తో కాల్వలు తీయించారు. ఆయా కాలనీలలో కూటమి నేతలు పర్యటించి సహాయక చర్యలలో పాల్గొన్నారు. తహసీల్దార్ మధుబాబు కోనంకి చప్టా వద్ద, పట్టణ సీఐ వెంకట్రావు బుడగజంగాల కాలనీ, రజక కాలనీలలో వరద ఉధృతిని పరిశీలించి చర్యలు చేపటారు. ఆయా కాలనీల్లో సహాయక చర్యలలో కూటమి నేతలు పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, శ్రీను, సాంబశివరావు, రమేష్, రాంబాబు, గంగరాజు, పాల్గొన్నారు. పట్టణ సమీపంలోని రజక కాలనీ, బుడగజంగాల కాలనీలలో మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, సీఐ వెంకట్రావు, ఏఈ రోహిణిలు బుధవారం పర్యటించారు. పట్టణ పరిధిలో వర్షపునీటితో ఇబ్బందులు ఏర్పడితే 98499 00755 నెంబరుకు ఫో న్‌చేస్తే మున్సిపల్ సిబ్బందితో సహాయక చ ర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు.

● దాచేపల్లి: తుఫాన్‌తో వాగులు పొంగిపొర్లు తున్నాయి. పత్తిపంటలో పూత, పిందె, కాయ నేల రాలింది. పాలు పోసుకుంటున్న వరిపంట నేలవాలింది. తుఫాన్ ధాటికి రైతులు, జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. నాగులేరు, నల్లవాగు, రాళ్ళవాగు, ఒద్దులవాగు, కంజులవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, సీఐ భాస్కరరావు, విద్యుత్ డీఈఈ వీరేశ్వరరావు, ఏవో వెంకటేష్ గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

● మాచవరం: మూడు రోజులుగా కురుస్తున్న తుఫాన్ వర్షాలకు మాచవరం మండలంలోని పలు వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షానికి నాగేశ్వరపురం తండా ఉన్న పిల్లేరు వాగు చప్టాపై పొంగి ప్రవహిస్తుంది. గాంధీనగరం వద్ద చప్టాపై రవాణా స్తంభించింది. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు మండల గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. పిల్లేరు వాగు వద్ద ఎస్‌ఐ తిరుపతిరావు బందోబస్తు ఏర్పాటుచేసి రాకపోకలు నిలిపివేశారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి పలు గ్రామాల్లో పర్యటించి తుఫాన్ పరస్థితులను పరిశీలించారు.

సహాయక చర్యలపై యరపతినేని సమీక్ష

పిడుగురాళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ ప్రభావంతో పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలలో నీటమునిగిన కాలనీలలో సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాలతో కూటమినేతలు స్పందించారు. రజక కాలనీ, బుడగజంగాల కాలనీలలో అధికంగా చేరిన వర్షపు నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయడంతోపాటు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. వర్షప్రభావం తగ్గేదాకా కూటమి నేతలు అధికారులతో సమన్వయం చేసుకుంటూ తక్షణమే స్పందించేలా చూసుకోవాలని ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు సూచించారు. అదేవిధంగా ఎమ్మెల్యే యరపతినేని వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో బుధవారం పలుమార్లు ఫోన్‌లో మాట్లాడి నీటమునిగిన పంట వివరాలు తెలుసుకున్నారు.

టౌన్ ప్లానింగ్‌లో అవినీతి జరుగుతుంది

● కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం

సత్తెనపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతి జరుగుతుందని, మునిసిపల్ స్థలాలు అన్యాక్రాంతమైనా పట్టించుకోవటం లేదని నాల్గవ వార్డు కౌన్సిలర్ కటకం రామకృష్ణ అన్నారు. బుధవారం మునిసిపల్ చైర్మన్ చలంచర్ల లక్ష్మీ తులసీ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలోని 2వ సచివాలయం పరిధిలో ఒక వ్యక్తి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని చేపట్టినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై టీపీవో రాధాకృష్ణ మాట్లాడుతూ స్థల వివాదం కోర్టులో ఉందని తెలిపారు. రామకృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వంలో మునిసిపల్ స్థలాల వివరాలను బహిర్గతం చేయాలని, అక్రమ నిర్మాణదారులపై, అక్రమ లేఅవుట్ దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మునిసిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ టిడ్కో గృహాల ప్రాంతంలో రహదారిపై గోతులు తీయటం వల్ల ఇబ్బందిగా ఉందన్నారు. ఎజెండాలో పొందు పరిచిన వివిధ అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో అచ్యుత శివప్రసాదు, కూకుట్ల లక్ష్మీ,పెద్దింటి గోవిందమ్మ, బండి రాజ్యలక్ష్మి, కంభంపాటి అబ్రహం, జిలానీ తదితర కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

జన జీవనం అస్తవ్యస్తం

● లోతట్టు ప్రాంతాలు జలమయం



నకరికల్లు: తురకపాలెం-రావిపాడు మార్గంలో వర్షపు నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ పుల్లారావు



నకరికల్లు: చెట్లను తొలగిస్తున్న కండ్లకుంట పీఎస్ మమత, పంచాయతీ సిబ్బంది

సత్తెనపల్లి,రాజుపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల సత్తెనపల్లి ప్రాంతంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని సుందరయ్యకాలనీ, నాగన్నకుంట ప్రాంతాల్లో వర్షపునీరు రహదారులపై ప్రవహించి ప్రజలు బయటకురాలేని పరిస్థితి నెలకుంది. మండలంలోని పెదమక్కెన వద్ద వాగు పొంగింది. రాజుపాలెం మండలం గణపవరం-బలిజేపల్లి మధ్య రహదారిపై ఎద్దువాగు పొంగింది. దీనివల్ల ఉప్పలపాడు, ఇనిమెట్ల ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అనుపాలెం వద్ద జాతీయ రహదారిపై వాగు పొంగి గుంటూరు-హైదరాబాద్ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ము నిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ తదితరు లు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి చర్యలు చేపట్టారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వాగులు, వంక లు పొంగటంతో సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుం చి వివిధ మార్గాలకు వెళ్ళే 26 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. రాజుపాలెం మం డలం గణపవరంలోని జంగాలకాలనీలో రెం డు పూరి గుడిసెలు కూలిపోయాయి. గుడిసెల ను తహసీల్దార్ సరోజ, ఎంపీడీవో శ్రీనివాసరా వు తదితర అధికారులు పరిశీలించారు. గణపవరం, బలిజేపల్లి, చౌటపాపాయపాలెం, కోటనెమలిపురి గ్రామాలలో లోతట్టుప్రాంతాలలో 76 కుటుంబాల వారికి అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు భోజనాలు ఏర్పాటు చేశారు.

● సత్తెనపల్లి రూరల్: వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వాగులు పొంగిపొర్లాయి. లోలెవల్ చప్టాలపై వర్షపునీరు ప్రవహించింది. సత్తెనపల్లి-అమరావతి ప్రధాన రహదారిలోని నందిగామ వద్ద లోలెవల్ చప్టాపై, గుడిపూడి-పెదమక్కెన రహదారిలోనిలో చప్టాపై, పెద మక్కెన-గర్నెపూడి రహదారిలో, ఫణిదం-భట్లూరు, కట్టమూరు-పీసపాడు మార్గంలో చప్టాలపై వర్షపునీరు ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా చప్టాల వద్ద అధికారులు బందోబస్తు నిర్వహించారు.

● ముప్పాళ్ళ: తుఫాను దాటికి మండలంలో మంగళవారం, బుధవారాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు పొంగిప్రవహించాయి. కొన్నిగంటల పాటు సత్తెనపల్లి- నరసరావుపేట ప్రధానరహదారిలో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వాగుల వద్ద సిబ్బందిని కాపలా ఉంచారు. నార్నెపాడు-బేతపూడి మధ్య వాగుపై నీరు ఉధృతంగా ప్రవహించింది. గోళ్ళపాడు వాగు, లంకెళకూరపాడు-నార్నెపాడు, మాదల-రుద్రవరం, ముప్పాళ్ళ-తురకపాలెం మధ్యన రాకపోకలను ఆపింది. గోళ్ళపాడు ఎస్టీ కాలనీలోకి వర్షపునీరు చేరింది. అధికారులు వారిని స్థానిక ఆర్‌ఎస్‌కేకి తరలించారు. గోళ్ళపాడు కేజీబీవీ ప్రాంగణంలోకి వర్షపునీరు చేరింది.గోళ్ళపాడు ఎస్టీకాలనీవాసులను వైసీపీ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి పరామర్శించాడు.

● నకరికల్లు: మండలంలో పలు చోట్ల చెట్లు రోడ్లకు అడ్డంగా పడిపోయాయి. తురకపాలెం-రావిపాడు మధ్య వర్షపు నీరు ఉధృతంగా రావటంతో రాకపోకలు నిలిచిపోయాయి. రూపెనగుంట్ల వీఆర్‌వోను అక్కడ కాపలావుంచారు. డీటీ కొండారెడ్డి, ఆర్‌ఐ సిద్దయ్య పర్యవేక్షించారు. కండ్లకుంట పాత ఎస్సీ కాలనీలో వర్షపు నీరు రోడ్లపైకి రావటంతో పీఎస్ మమత తీయించారు. చీమలమర్రి-కండ్లకుంట, కండ్లకుంట-రూపెనగుంట్ల, నకరికల్లు-కారంపూడి మార్గాల్లో పడిన చెట్లను తొలగించారు. కండ్లగుంట పాత ఎస్సీకాలనీలోకి నీళ్ల రావడంతో కాలనీవాసులు ఇబ్బందిపడ్డారు. వారికి మాజీ సర్పంచ్ రామయ్య కూరగాయలను పంపిణీ చేశారు.



ముప్పాళ్ల: నార్నెపాడు-బేతపూడి మధ్య వాగుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు



సత్తెనపల్లి: పాకాలపాడు వద్ద పత్తిలో చేలో నిలిచిన వర్షపు నీరు



రాజుపాలెం: గణపవరంలో కూలిన గుడిసెను పరిశీలిస్తున్న తహసీల్దార్ సరోజ, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు



సత్తెనపల్లి: నాగన్నకుంటలో ప్రాంతంలో వర్షపు నీరు



అమరావతి: ఉంగుటూరు చెరువు పొంగడంతో రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు



అమరావతి: వరద నీటిలో నానుతున్న పత్తిపంట

పొంగిపొర్లుతున్న వాగులు


అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో పాటు ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరదనీటితో మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో అమరావతి-సత్తెనపల్లి, క్రోసూరు, విజయవాడ మార్గాలలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అంతేగాక లేమల్లె-ఉంగుటూరు మార్గంలో ఉంగుటూరు చెరువు పొంగడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వందల ఎకరాలలో వరదనీరు చేరి పత్తి, మిరప పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఎంపీపీ హనుమంతరావు, తహసీల్దార్ డానియేలు, ఎంపీడీఓ పార్వతీ, సీఐ అచ్చియ్య పరిశీలించారు. పునరావాస కేంద్రాలలోని వారికి భోజనవసతి కల్పించారు. అమరావతిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రహదారిపై పడిన చింతచెట్టును విద్యుత్ శాఖ, పోలీసు అధికారులు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. నియోజకవర్గంలో పరిస్థితిపై ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులతో పర్యవేక్షిస్తున్నారు.

● పెదకూరపాడు: మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చెట్లు విరిగి పోయాయి. సత్తెనపల్లి-అమరావతి ఆర్‌అండ్‌బీ రహదారిలో చెట్లు పూర్తిగా వంగి ఉండటంతో తహసీల్దార్ ధనలక్ష్మి, ఎస్ఐ గిరిబాబులు దగ్గరుండి తొలగించారు. 75 తాళ్ళూరులోని ఎస్సీ కాలనీలోకి వర్షపు నీరు వెళ్ళటంతో కాలువల్లో పూడిక తీయించారు. పరస-గుంటూరు రోడ్డులో లోలెవల్ చప్టాలపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ లైన్‌లపై పడటంతో ఏఈ దాసరి రామకృష్ణ పర్యవేక్షణలో పనులు నిర్వహించి విద్యుత్ పునరుద్ధరణ చేశారు. బుచ్చయ్యపాలెంలో చెరువుకు గండి పడటంతో చెరువులోని నీరు పొలాల్లోకి చేరింది. బలుసుపాడు, కంభంపాడు, లింగంగుంట్ల, ముస్సాపురం, పరస గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి.

● క్రోసూరు: మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించి పలు గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. పిడుగురాళ్ళ-క్రోసూరు మధ్య రాకపోకలు స్తంభించాయి. దొడ్లేరు-హసానాబాద్ మధ్య ఉన్న వాగు, ఉయ్యందన - అనంతవరం మధ్య ఉన్న వాగు ప్రధానరోడ్డుపై ఐదు అడుగుల ఎత్తున పొంగి ప్రవహిస్తున్నాయి. గరికపాడు చెరువుకు గండి పడి నీరు గ్రామంలోకి చేరింది. సీఐ పత్తిపాటి సురేష్, తహసీల్దార్ వేముల నాగరాజు గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు, డీసీ చైర్మన్‌ల సహకారంతో ఇసుకబస్తాలు ఏర్పాటు చేసి ప్రమాదాన్ని నివారించ గలిగారు. ఎర్రబాలెం - పీసపాడు గ్రామాల మధ్య ప్రధాన రహదారిలోని లోలెవల్ చప్టా పైకి నీరు చేరి సత్తెనపల్లి - క్రోసూరు మధ్య రాకపోకలు స్తంభించాయి. దొడ్లేరు ఎస్సీ కాలనీ, క్రోసూరులోని జగనన్న కాలనీలోకి భారీగా వరదనీరు చేరింది. క్రోసూరు-అందుకూరు మధ్య ఎద్దువాగు పొంగింది.మండలంలోని ఉయ్యందన ప్రాథమికోన్నత పాఠశాల గాలులకు, వర్షానికి పాఠశాల పైకప్పు లేచిపోయింది. మండలంలోని దొడ్లేరు ఎస్సీ కాలనీలో భారీగా వరద నీరుచేరటంతో స్థానికులందరినీ పునరావాసకేంద్రానికి తరలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాన్ ఆధ్వర్యంలో స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేసి ఆహారం సమకూర్చారు. తహసీల్దార్ వేముల నాగరాజు, ఎంపీడీవో రవికుమార్ సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. గృహాల్లోకి వరదనీరు చేరింది.


● బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెం -నందిరాజుపాలెం రహదారిలో ఎర్రబాలెం మేజరు కాలువ వెంట వర్షపు నీరు భారీగా రావటంతో రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలిగింది. మన్నెసుల్తాన్‌పాలెం వెళ్ళే లోలెవల్ చప్టాపై బుధవారం ఉదయం నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

● అచ్చంపేట: మండలంలో వేల్పూరు, తాళ్ళచెరువు, గింజుపల్లి తదితర ప్రాంతాల్లో మొక్కజొన్న పం టలు పూర్తిగా పడిపోయాయి. వేల్పూరులో పత్తి రాలిపోయింది. గింజుపల్లిలోని మిర్చిపైరులో వర్షపునీటిలో నానుతున్నాయి. చిగురుపాడు వద్ద వాగు పొంగింది. పోలీసు అధికారులు వాగువద్ద కాపలాగా ఉన్నారు.



పెదకూరపాడు: కంభంపాడు వద్ద లోలెవల్ చప్టా పై ప్రవహిస్తున్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ ధనలక్ష్మి

క్రోసూరు: గరికపాడు చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న సీఐ పత్తిపాటి సురేష్, తహసీల్దార్ నాగరాజు



వరద ముంపు

మాచర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పర్యటించారు. సహాయక చర్యలపై సమీక్షించారు. చంద్రవంక వరదను సమీక్షించి జిల్లా ఉన్నతాధికారులకు వివరించారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, తహసీల్దార్ కిరణ్, చైర్మన్ మధార్‌సాహెబ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, టీడీపీ సీనియర్ నేత కజ్జం సైదయ్య, శశిధర్‌రెడ్డిపాల్గొన్నారు.

● వెల్దుర్తి/దుర్గి: వెల్దుర్తి మండలం విలవిల్లాడింది. తుఫాన్ ఉధృతికి వాగులు, వంకలు పొంగిపొర్లి రాకపోకలు స్తంభించాయి. మండలంలోని కుర్రి మల్లయ్య బ్రిడ్జి వాగు మంగళవారం రాత్రి పొంగిపొర్లడంతో కుంకుడుచెట్టు తండాను వరద చుట్టుముట్టింది. తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, ఎస్ఐ సమందర్‌వలి తమ సిబ్బందితో గ్రామానికి చేరుకొని వరదలో చిక్కుకున్న సుమారు 40 కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. పట్లవీడు వాగు చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రచ్చమలపాడు వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. హనుమాపురంతండాలో వరద నీటిలో చిక్కుకున్న తండా వాసులను అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ముటుకూరు, కోలగుట్ల వద్ద వాగులు పొంగి రోడ్లపై ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుర్గి పొలాలు నీట మునిగాయి. వరద ప్రాంతాలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. మండలంలోని శిరిగిరిపాడు జడ్పీ హైస్కూల్‌లోపునరావాస కేంద్రంలోకి కుంకుడుచెట్టు తండా ప్రజలకు భోజనం వడ్డించారు.

● విజయపురిసౌత్: తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడడంతో ఎత్తిపోతల జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎత్తిపోతల దిగువ భాగంలోని రంగనాథస్వామి ఆలయం వద్దకు భారీగా నీరు చేరింది. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో గౌరమ్మ అనే మహిళ నివాసముండే రేకుల గృహం కుప్పకూలింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ కిరణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సమీపంలోని నీలపురాజు అనే వ్యక్తి షెడ్డు వర్షాలకు ఒరిగిపోయింది. కార్యక్రమంలో వీఆర్వో రవికుమార్ పాల్గొన్నారు.

● రెంటచింతల: గోలి గ్రామం నుంచి సత్రశాల పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారికి ఏర్పడిన గండిని ఆర్ అండ్ బీ అధికారులు ఆఘమేఘాల మీద పూడ్చారు. రెంటచింతలలోని చర్చీ సమీపంలో విద్యుత్‌స్తంభం విరిగిపడింది. మండలంలోని పిల్లివాగు, గోలి వాగు, రెంటాల ఏడుమంగళం వాగులు నీటితో పొంగిపొర్లాయి. మండలంలో 50.1 మిమీల వర్షపాతం నమోదైంది.

● కారంపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన భీకర గాలులకు కారంపూడిలో భారీ చింత చెట్టు కూలి ఓ ఇంటితో పాటు రెండు షాపులపై పడింది. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పట్టణ మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, సీనియర్ నేత మస్తాన్‌జానీ, మాచర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాటంరెడ్డి నాగలక్ష్మిరెడ్డి, సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్‌లు సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి బాధితులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు. అలాగే ఎన్టీఆర్ బొమ్మ సెంటర్ ప్రాంతంలోనే మరో చింతచెట్టు కూలి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడింది. చుట్టుపక్కల గృహాల వారు భయభ్రాంతులకు గురయ్యారు. మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు బుధవారం ఒప్పిచర్లలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఏదయినా అవసరముంటే సెల్ 7093004566కు సమాచారం అందించాలన్నారు.

● గురజాలటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణ, రూరల్ ప్రాంతాల్లో మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షం కురిసింది. దాంతో వాగులు పొంగి ప్రవహించాయి. దైద అమరలింగేశ్వరస్వామి బిలంలో భారీగా వర్షపునీరు చేరింది. బుధవారం భక్తులు వర్షపు నీటిలోనే వెళ్లి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. వర్షాలకు భోజన సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు గురజాల తెలుగు యువత నేత మేడికొండ రాంబా బు భోజనం అందించారు.



హనుమాపురం తండాలో పొక్లెయిన్ సాయంతో ప్రజలను బయటకు తీసుకొస్తున్న అధికారులు




పట్లవీడులో వరద నీటిలో చిక్కుక్కున అంగన్‌వాడీ, ఎంపీయూపీ స్కూల్



విజయపురిసౌత్‌లో కుప్ప కూలిన రేకుల కప్పుఇల్లు



రెంటచింతల: చర్చి సమీపంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం



పొంగిపొర్లుతున్న ఆత్మకూరు చెరువు


బాపట్ల రోడ్డుపై చెట్లను తొలగించిన సీఐ హరికృష్ణ, తహసీల్దారు


చిన్నచెరువు ఉప్పాంగి ప్రత్తిపాడులో నీట మునిగిన ప్రధాన రోడ్డు


నాదెండ్ల: ఎండుగంపాలెం పునరావాస కేంద్రంలో బాధితులు


బాపట్ల: మిర్చి పంటను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్

మొత్తమొంథా అలజడి


గుంటూరులో విద్యుత్ వైర్లను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

మొంథా తుపాను తీరం దాటే సమయంలో ఉమ్మడి జిల్లా మొత్తం అలజడి సృష్టించింది. భారీ ఈదురు గాలులకు రోడ్లపై చెట్లు నేలకూలాయి. వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వరి, పత్తి, కంద ఇతర పంటలు పూర్తి ముంపునకు గురయ్యాయి. పట్టణ, పల్లె ప్రాంతాల రోడ్లు జలమయమై.. చెరువులను తలపించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అధికారుల హెచ్చరికలు లెక్కచేయకుండా.. కొంతమంది ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల చప్టాలను దాటే క్రమంలో, అలాగే కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకోగా పోలీసు సిబ్బంది వారిని రక్షించారు. విద్యుత్ స్తంభాలు నేలవాలగా.. కొన్ని కోట్ల తీగలు తెగి రోడ్ల పడ్డాయి. విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది ఎప్పటికప్పుడు తెగిపడిన విద్యుత్ తీగలను, నేల కూలిన చెట్లను తొలగిస్తూ.. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పనిచేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పునరావాస కేంద్రాలను సందర్శించి, ఆశ్రయం పొందుతున్న ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. వారికి కల్పించిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణాల్లో ఎక్కడికక్కడ నీరు నిలబడకుండా పారిశుధ్య సిబ్బంది పనిచేశారు.

- గుంటూరు-ఆంధ్రజ్యోతి


బాపట్లలో ఈదురు గాలులకు వణికిపోతున్న కొబ్బరి చెట్లు



పెద్దమద్దూరు వాగు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


ఐనవోలు వద్ద వల్లేరు వాగు ఉధృతికి నిలిచిపోయిన రాకపోకలు


కొల్లూరులో గాలులు వాలిపోయిన బొప్పాయి తోట


చిలకలూరిపేటలో పర్యటిస్తున్న కలెక్టర్ కృతికా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి


గుంటూరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన లారీలు


తిమ్మాపురం అండర్ పాస్ వద్ద ప్రవహిస్తున్న వరద నీరు


గుంటూరు: ఏటి అగ్రహారంలో వర్షపు నీటిలో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారుడు


గుంటూరు మురికి పేటలో పొంగిపొర్లుతున్న డ్రెయిన్

సస్యరక్షణతోనే వరి పంట చేతికి..!



- వరి పంటపై తుపాను ప్రభావం
- రైతులకు జాగ్రత్తలు పాటించాలి
- రంగా వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో వరి పంట సంరక్షణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ బుధవారం వివరించారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల రైతులు అప్రమత్తం కావాలని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ రైతులకు ఈ సూచనలు చేశారు. ప్రస్తుతం వరి పంట పూత దశ, పాలు పోసుకునే, కోత దశలలో ఉంది. వీలైనంత వరకు పొలం నుంచి వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపాలి. పూత దశకు ముందు ఉన్న చేలల్లో.. వర్షం తగ్గిన తర్వాత ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే ఎండాకు, మానిపండు తెగులు, మాగుడు, ఆకుముడత తెగుళ్లు, దోమపోటు పెరిగే అవకాశం ఉంది.

గింజ గట్టిపడే దశలో ఉంటే

నిరంతర వర్షాల వల్ల ధాన్యపు గింజలో నిద్రావస్థ తొలగి నిలబడి, పడిపోయిన చేలలో మొలక వచ్చే అవకాశం ఉంది. కోత దశలో నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనపడితే.. నీరు బయటకు తీసివేసిన తర్వాత.. 5 శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాములు కల్లు ఉప్పు/లీటరు నీటికి)కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకెత్తడాన్ని, రంగు మారడాన్ని తగ్గిస్తుంది.

కల్లాల మీద ధాన్యం ఉన్నప్పుడు

ఇప్పటికే కోతకోసి కుప్పల మీద ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పుకొని రక్షించుకోవాలి. నూర్పిన ధాన్యం రెండు మూడు రోజులు ఎండబెట్టడానికి వీలుకాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా క్వింటా ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీల పొడి ఊక కలపాలి.

పూత దశలో తెగుళ్ల నివారణ

రైతులు పంట దశ, పురుగు, తెగుళ్ల ఉధృతిని బట్టి సస్య రక్షణ చేపట్టాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే ప్లాంటోమైసిన్ ఒక మి.లీ/లీటరు + కొసైడ్ (కాపర్ హైడ్రాక్సయిడ్) 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- నీరు తగ్గిన తర్వాత హెక్సాకోనాజోల్ 400మి.లీ. ఎకరాకు లేదా ప్రోపికోనాజోల్ 200 మి.లీ పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుతుంది.
- మానిపండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మి.లీ. ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి.
- ఆకుముడత పురుగు నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు లేదా క్లోరాన్ట్రినిప్రోల్ 60 మి.లీ 200 లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- దోమపోటు, మాగుడు తెగులు, మానిపండు నివారణకు ఎకరాకు ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు ● పైమెట్రోజాన్ 120గ్రాములు లేదా ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు+96 మిల్లీలీటర్ల ట్రైఫ్లుమెజోపైరం 10 ఎస్‌సీ పిచికారీ చేసుకోవాలి.

తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీకి అందుబాటులో ఉన్న డ్రోన్‌లను ఉపయోగించుకోవాలి.

- పూత దశలో ఉన్న పంట (ఎంటీయూ-1061, ఎంటీయూ- 1318, ఎంటీయూ-1262, బీపీటీ-5204): నీరు నిలబడి ఉన్న చేలలో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉంది. ధాన్యం రంగు మారకుండా, మానిపండు, మాగుడు తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉంది.
- పాలు పోసుకునే దశలో ఉన్న పంటలు (స్వర్ణ, సంపద స్వర్ణ, బీపీటీ- 5204, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం-1638 మొదలైనవి) వర్షాలకు పడిపోతే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. అవకాశాన్ని బట్టి పడిపోయిన పంటను పైకి లేపి కట్టుకోవాలి. నిలబడి ఉన్న, పడిపోయిన పంట చేలలో గింజలు రంగు మారడం, మాగుడు, మానిపండు తెగుళ్ల వ్యాప్తి నివారణకు ఎకరాకు 200 మి.లీ ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి.

గుంటూరుకు పలు రైళ్ల పాక్షిక రద్దు

- డోర్నకల్‌లో రైలు పట్టాల పైకి వరద నీరు
- కొన్ని రైళ్లు గుంటూరు - పగిడిపల్లి మార్గంలో మళ్లింపు



గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షం కారణంగా వరంగల్ సమీపంలోని డోర్నకల్ రైల్వేస్టేషన్ యార్డులోకి భారీగా వరద నీరు చేరి నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో గుంటూరుకు రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. బుధవారం ఉదయం 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ సమీపానికి వెళ్లేసరికి రైలు పట్టాలపై వరద నీరు చేరడంతో అక్కడే నిలిపేశారు. వరద తగ్గుముఖం పట్టకపోవడంతో ఈ సర్వీసును రద్దు చేశారు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని కూడా వరంగల్ వరకే నడిపి వరంగల్ - గుంటూరు మధ్యన రద్దు చేశారు. దీని వల్ల మధ్యాహ్నం గుంటూరు నుంచి బయలుదేరాల్సిన 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీని పూర్తిగా రద్దు చేయాల్సి వచ్చింది. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని పగిడిపల్లి - నడికుడి మీదగా గుంటూరుకు దారి మళ్లించారు. 20833 విశాఖపట్టణం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ని విజయవాడ నుంచి కృష్ణాకెనాల్, గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించి సికింద్రాబాద్‌కు తీసుకెళ్లారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, 17205 షిర్డి సాయినగర్ - కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్, 11019 ముంబై సీఎస్‌టీ - భువనేశ్వర్, 18046 చర్లపల్లి - షాలిమార్, 17206 కాకినాడ పోర్టు - షిర్డి సాయినగర్, 17405 తిరుపతి - అదిలాబాద్, ఎక్స్‌ప్రెస్‌లను కూడా గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్ రద్దు

12747 గుంటూరు - వికారబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్ రోజులానే వికారబాద్‌కు వెళ్లింది. ఇదే రేక్ నంబరు 12748గా మారి వికారబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌గా రిటర్న్ రావాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో రద్దు చేశారు. దీంతో గురువారం ఉదయం గుంటూరు నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. వికారబాద్ నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్ సర్వీసుని గురువారం పునరుద్ధరిస్తామన్నారు.

డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు

- మొంథా తుపానుతో పలు సర్వీసులు రద్దు


గుంటూరులో డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు


గుంటూరు-2 డిపో గ్యారేజ్‌లోకి చేరిన వర్షపునీరు

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో అత్యధిక బస్సు సర్వీసులు ఆర్టీసీ డిపోలకే పరిమితమయ్యాయి. మూడు రోజులుగా గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ ప్రయాణికుల్లేక బోసిపోతోంది. మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లోనూ సర్వీసులను తగ్గించుకోవాల్సి వచ్చింది. తుపాను ప్రభావం చూపిన బుధవారం ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు ప్రజా రవాణాధికారి డి. సామ్రాజ్యం ఎప్పటికప్పుడు పలు రూట్‌ల పరిస్థితిని సమీక్షించారు. సర్వీసులను రద్దు చేశారు. అమరావతి రూట్, తెనాలి, బాపట్ల, పర్చూరు, మాచర్ల వంటి రూట్‌లలో రహదారుల పరిస్థితి, చప్టాల వద్ద వరదలు కారణంగా.. ఆయా రూట్‌లలో బస్సులను నిలిపివేశారు. ఆర్టీసీ ఆదాయంపై మొంథా తుపాను ప్రభావం పూర్తి స్థాయిలో కనిపి స్తోంది. మూడు రోజు లుగా ప్రయా ణికుల రాకపోకల్లేక బస్సులు అరకొర ప్రయాణికులతో నడుస్తున్నాయి. మరో రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సాగర్ ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండ చరియలు

విజయపురిసౌత్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నాగార్జున సాగర్ సరిహద్దు.. అంతరాష్ట్ర చెక్‌పోస్టుకు వెళ్లే ఘాటు రోడ్డులో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు ఆ వైపు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ ఎస్‌ఐ ఘటనా ప్రాంతానికి చేరుకొని క్రేను సాయంతో కొండ చరియలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవికుమార్, వీఆర్‌ఏ రవి తదితరులు పాల్గొన్నారు.


రహదారిపై విరిగిపడ్డ కొండ చరియలు

గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో..
విద్యుత్ ట్రాక్షన్ రెట్టింపు

- రూ. 188.31 కోట్ల నిధులకు ఆమోదం తెలిపిన కేంద్రం
- విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్‌లోనూ ఏర్పాటు


రైల్వే విద్యుత్ ట్రాక్షన్

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ట్రాక్షన్ సామర్థ్యాన్ని రైల్వే శాఖ రెట్టింపు చేసేందుకు నిర్ణయించింది. 1 25 కేవీ విద్యుత్ ట్రాక్షన్‌ని సామర్థ్యాన్ని 2 25 కేవీకి పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మూడేళ్లలో ఈ ప్రాజెక్టుని రూ.188.31 కోట్లతో పూర్తి చేస్తారు. ఇందులో భాగంగా సర్క్యూట్ బ్రేకర్ల మార్పు, స్విచ్చింగ్ స్టేషన్లు, అదనపు కండ క్టర్లను ఏర్పాటు చేయడం వంటి పనులు చేస్తారు. దీని వల్ల విద్యుత్ ప్రసార నష్టాలు గణనీయంగా తగ్గిపోతాయి. అలానే రైళ్లను 160 కిలోమీటర్ల వేగంతో నడిపేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. విపత్తులు, ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల సమయంలో వరంగల్ మార్గంలో ప్రయాణిం చే రైళ్లను పగిడిపల్లి మీదగా మళ్లిస్తోన్న దృష్ట్యా విద్యుత్ ట్రాక్షన్ రెట్టింపు ఎంతో అవసరమని రైల్వే శాఖ భావిస్తోంది. హైదరాబాద్, అమరావతిని కలిపే రైలు మార్గాల్లో గుంటూరు - పగిడిపల్లి సెక్షన్ ఒకటి. విష్ణుపురం - మోటుమర్రి మధ్యన గూడ్స్ ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా రైలుమార్గం ఉంది. మొత్తం 337 కిలోమీటర్ల పొడవునా విద్యుత్ ట్రాక్షన్‌ని రెట్టింపు చేయాలని రైల్వే శాఖ ప్రతిపాదించింది. ట్రాక్షన్ రెట్టింపు వల్ల అధిక వోల్టేజీతో విద్యుత్ సరఫరా అందిస్తుంది. తద్వారా రైళ్లు, గూడ్స్‌లను అధిక వేగంతో, ఎక్కువ సామర్థ్యంతో నడపడానికి ఆస్కారం ఏర్పడుతుంది. రైళ్లకు అవసరమైన స్థిరమైన వోల్టేజీని సులభతరం చేస్తుంది. సర్క్యూట్ లోపాలను అధిగమించి నిరంతర విద్యుత్ సరఫరాని అందిస్తుంది. దీని వల్ల సబ్‌స్టేషన్ల సంఖ్యని కూడా తగ్గించుకోవచ్చు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రాజెక్టుకి బుధవారం పచ్చజెండా ఊపుతూ సికింద్రాబాద్ - విజయవాడ చాలా రద్దీగా ఉండే రైలు మార్గాల్లో ఒకటిగా ఉందన్నారు. పగిడిపల్లి - గుంటూరు, విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్ సికింద్రాబాద్, విజయవాడ మధ్య ప్రత్యామ్నాయంగా పని చేస్తుందన్నారు. ఈ మార్గంలో మరిన్ని రైళ్లు నడపడానికి 2 25 కేవీ విద్యుత్ ట్రాక్షన్ ఎంతో అవసరమని గుర్తించి ప్రాజెక్టుని మంజూరు చేశామన్నారు.

తుఫాను బాధితులకు ప్రత్తిపాటి పరామర్శ

చిలకలూరిపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణం, మండలంలోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం పర్యటించి తుఫాన్ బాధితులను పరామర్శించారు. పట్టణంలోని 11, 17, 28, 29, 30, 38 వార్డులు, పసుమర్రు ఎస్టీ కాలనీలలో బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాలను సందర్శించి భోజన, వసతి ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా 20 సెం.మీ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. ఎంత వర్షం వచ్చినా ఎక్కడా నీరు నిలవకుండా,



చిలకలూరిపేటలో తుఫాను బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పట్టణంలో కురిసిన వర్షపునీరు మొత్తం కుప్పగంజి, ఓగేరు వాగుల్లోకి చేరేలా ఇంజనీర్లను సంప్రదించి డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రత్తిపాటి వెంట అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జీవీ పర్యటన

వినుకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విస్తృతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాలు, లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో పర్యటించి బాధితులకు అందుతున్న సహాయ కార్యక్రమాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అధికారు మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలని, వరద సహాయ కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జీవీ హెచ్చరించారు. తుపాను బాధితుల కోసం వినుకొండ నిర్మల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లపై తుపాను బాధితులను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలో నీటమునిగిన అరుంధతి కాలనీ, రజక కాలనీని చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పరిశీలించారు.

సమర్థవంతంగా ఎదుర్కొంటాం: జీవీ

తుపాన్ నష్టాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తుపాను రాష్ట్రంలో అనేక ఇబ్బందులు సృష్టిందని, ప్రభుత్వం ఎంతో అప్రమత్తంగా ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించగలిగామన్నారు. సీఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సచివాలయంలోనే ఉండి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. ఆర్టీజీ సెంటర్‌కు వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి రియల్ టైమ్‌లో సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ముందస్తు చర్యలు చేపట్టడం వల్లే ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా నివారించగలిగామన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా 200 కుటుంబాలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో ఎమ్మెల్యే అరవిందబాబు పరిశీలన

నరసరావుపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ దృష్ట్యా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రజలకు అందుబాటులో ఉంటూ బుధవారం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పట్టణంలో మున్సిపల్ కమీషనర్ తో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. 1, 34, 5, 2. 12 వార్డు కాలనీలలో పర్యటించారు. గుంటూరు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, బరంపేట, చుట్టపక్కల ప్రాంతాలలోని ప్రజల్ని సమీపంలోని మున్సిపల్ పాఠశాలకు బస్సులలో తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రజలకు స్వయంగా ఆహారం అందించి వారి ధైర్యం చెప్పారు. సత్తెనపల్లి రోడ్డులోని నీట మునిగిన డాక్టర్ కోడెల శివప్రసాదు స్టేడియం, సమీపంలోని వాగు, దానిపై పొంగిపొర్లుతున్న ప్రవాహాన్ని పరిశీలించారు. అదేవిధంగా గుంటూరు రోడ్డులోని స్వర్గపురి వద్ద రోడ్డు పై ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలించారు.

తుపాను బాధితులకు దాతల సాయం

యడ్లపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా నిరాశ్రయులైన వారికి కూటమి నాయకులు, అధికారులు అండగా నిలిచారు. మండలంలోని లింగారావుపాలెం జగనన్న కాలనీని వరద ముంచెత్తడంతో నిరాశ్రయులైన వారికి కూటమి నాయకులు పండ్లు, బిస్కెట్లు, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తోకల రాజేష్, తులాబందుల సత్యన్నారాయణ, దాట్ల వెంకటేశ్వరరాజు, మల్లా కోటేశ్వరరావు, బండెల శ్రీనివాసరావు, నక్క వెంకటదుర్గ, కొండా సాంబశివరావు, చక్క ఆంజనేయులు, రావూరి సుబ్బారావులు పాల్గొన్నారు. యడ్లపాడు చెంచు కాలనీలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడుతున్న వారికి టీడీపీ నాయకులు పోపూరి రాఘవయ్య అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించారు. కాగా యడ్లపాడు-నాదెండ్ల మార్గం ప్రక్కన గుడిసెలు వేసుకుని ఉంటున్న వలస కూలీలకు వీఆర్వో జగన్‌మోహనరావు భోజన సదుపాయం కల్పించారు.

● నరసరావుపేట టౌన్: కోటప్పకొండ యనాది కాలనీలోని 150 మందికి బుధవారం షెల్టర్ ఏర్పాటు చేశారు. వారికి నరసరావుపేట శ్రీసత్యసాయి సేవా సమితి తరపున సేవాదళ్ సభ్యులు భోజనం అందజేశారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని కేసానుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మాగం పుల్లారావునగర్‌లో నిరాశ్రయులైన 20పేద కుటుంబాలకు నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు, చాపలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరసరావుపేట రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ కరీం మొహిద్దిన్, డైరెక్టర్లు ఎస్.కె.జిలాని మాలిక్, పాశం కృష్ణరావు, మేళ్లచెరువు సుమిత్ర కుమార్, లింగ ఆంజనేయులు, కేసనపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశాలతో బుధవారం పులిహోర పంపిణీ చేశారు. కాలనీలో ప్రజలకు టీడీపీ నాయకులు 50 కేజీలు పులిహోర, 50 కేజీల విజిటబుల్ బిర్యాని, 500 యాపిల్స్, 500 మినరల్ వాటర్ బాటిల్స్ అందజేశారు, కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో అధికారులు పూర్తిగా విఫలం

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను సహాయక చర్యల్లో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మొందా తుఫాన్ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలను డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన ఇళ్లకు సర్వే చేయించి వెంటనే ఆర్థికసాయం అందించాలన్నారు. చంద్రబాబు నాయుడు కాలనీలోని 10లైన్లు బరంపేటలో రెండు లైన్లు నీట మునిగాయని, బరంపేటలో విద్యుత్ స్తంభం విరిగినా, చెట్లు కూలిపోయినా అధికారులు ఇప్పటివరకు పట్టించుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి తుఫాన్‌పై తక్షణ చర్యలు చేపట్టమని పదేపదే విజ్ఞప్తి చేసి, కలెక్టర్లకు నిధులు విడుదల చేసినప్పటికీ నరసరావుపేట మున్సిపాలిటీలో ఎక్కడా పునరావాస కేంద్రాల ఏర్పాటు గాని, ఆహారం సరఫరా చేయటం గాని ఇంతవరకు జగకపోవటం చాలా బాధాకరమన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు పులిహార, అల్పాహారం అందజేశారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయశాఖ ఏడీ

యడ్లపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం పరిధిలోని పత్తి పొలాలను వ్యవసాయశాఖ ఏడీ కె శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ముందుగా రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పత్తి పంటతో పాటు వివిధ పంటలకు ఏ మేర నష్టం వాటిల్లిందన్న అంశాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. సందర్భంగా స్థానిక వ్యవసాయాధికారులు ముందస్తు పంట నష్టం అంచనాల నివేదికను ఏడీకి అందజేశారు. కార్యక్రమంలో ఏవో హరిప్రసాద్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



వినుకొండ: పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు



నరసరావుపేట పట్టణంలో ముంపు ప్రాంతంలో సహాయక చర్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

'మొంథా' ముంచేసింది

● పల్లపు ప్రాంతాలు జలమయం
● సత్తెనపల్లి.. గుంటూరు రోడ్లపై ప్రవహించిన వరద నీరు
● ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు పుల్లారావు, డాక్టర్ అరవిందబాబు పర్యటన
● నీట మునిగిన వరి, వాణిజ్య పంటలు
● పలు గ్రామాలకు రాకపోకలు బంద్
● విద్యుత్ తీగలు తెగిపోయి పలు గ్రామాల్లో అంధకారం

వర్షపాతం సెంటీ మీటర్లలో..

మండలం	వర్షపాతం
● చిలకలూరిపేట	20.94
● నాదెండ్ల	16.24
● యడ్లపాడు	15.48
● శావల్యాపురం	11.80
● బొల్లాపల్లి	11.26
● నరసరావుపేట	10.50
● నూజెండ్ల	9.88
● వినుకొండ	9.64
● ఈపూరు	9.64
● రొంపిచర్ల	6.24

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట పట్టణంలో భారీ వర్షం కురిసింది. వరద నీరు పోటెత్తింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో వరద ప్రవహించింది. సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియం చప్టా, గుంటూరు రోడ్డులోని స్వర్గపురి చట్టాలపై భారీగా వరద నీరు ప్రవహించడంతో వహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వలప చెరువు అలుగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, ఎస్ఆర్‌కేటీ కాలనీ, సత్తెనపల్లి రోడ్డులోని చప్టా ప్రాంతంలోని వీధులు జలమయమయ్యాయి. మునిసిపాల్టీ, పోలీసు, రెవెన్యూ శాఖలు అయా ప్రాంతాల్లో సహాయ చర్యలు చేట్టారు. చప్టాల వద్ద నీటి సరఫరాను మునిసిపాల్టీ పునరుద్ధరిచింది. అయా ప్రాంతాల్లో కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యటించారు. చేపట్టిన సహాయ చర్యలను వారు పరిశీలించారు. కమీషనర్ జస్వంతరావు, మునిసిపల్ అధికారులు, తహసీల్దార్ వేణు గోపాలరావు సహాయ చర్యలను పర్యవేక్షించారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట్లలో వరద నీరు ప్రవహించిన ప్రాంతాలను, వల్లప్ప చెరువు అలుగు ఉధృతిని కలెక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు. అయా ప్రాంతాల్లో తీసుకొవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు.

● చిలకలూరిపేట: మొంథా తుపాన్ చిలకలూరిపేటపై పెను ప్రభావం చూపింది. పల్నాడు జిల్లా మొత్తంలో చిలకలూరిపేటలోనే అత్యధికంగా 20.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. దీనితో చిలకలూరిపేట చుట్టూ ఉన్న కుప్పగంజి, ఒగేరు వాగులు ప్రమాద స్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ ఎస్టీ కాలనీలో నడుము లోతున వరద నీరుచేరింది. ఆ కాలనీ వాసులను గ్రామంలోని హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి రాత్రికి రాత్రి తరలించారు. కాలనీ పక్కనే ఉన్న 32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నేత మునిగింది. వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు చొరవ తీసుకుని జేసీబీ రప్పించి చీరాల రోడ్డుకు గండి కట్టించి వరద నీటిని దిగువకు పంపే ఏర్పాటు చేశారు. నీట మునిగీన ఎస్టీ కాలనీని, విద్యుత్ సబ్‌స్టేషన్ ను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. చిలకలూరిపేట ఆర్టీసీ బస్ డిపో పరిధిలో 70 శాతం బస్ సర్వీసులు రద్దయ్యాయి. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై స్మశానం వద్ద నుంచి ఏంఎంజీ సంస్థ వరకు మోకాలు లోతున వరద నీరు పారింది.

● యడ్లపాడు: మండలంలోని నక్కవాగు పొంగి పొర్లి తుర్లపాడు, సందెపూడి, జాలాది, జగ్గాపురం, దింతెనపాడు, యడ్లపాడు, లింగారావుపాలెం, సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల పరిధిలోని పంట పొలాలను ముంచెత్తడంతో వేల ఎకరాల్లో వేసిన పంటలు పూర్తిగా వర్షపు నీటిలో మునిగి పోయాయి. వ్యవసాయాధికారులు ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి సుమారు 4,457హెక్టార్లలో వేసిన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

కాలనీలను ముంచెత్తిన వరద నీరు..

మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వాగులు ఉప్పొంగడంతో పలు కాలనీలు నీట మునిగాయి. లింగారావుపాలెం పడమర వాగుకు వరద పోటెత్తడంతో జగనన్న కాలనీ నీట మునగగా, శివాలయం పరిసరాలలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. బోయపాలెం సుగాలి కాలనీలో వర్షపు నీరు ఇళ్ళల్లోకి చేరడంతో కాలనీ వాసులు రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా గడిపారు. కాగా దింతెనపాడు ఎస్టీ కాలనీని వరద నీరు ముంచెత్తడంతో కాలనీవాసులు నిరాశ్రయులయ్యారు. కారుచోల ఉత్తరం వైపున ఉన్న వీరమ్మ కాలువ పొంగి పొర్లడంతో పొలాల్లోకి వరద నీరు చేరింది. అంతేగాకుండా గ్రామంలోని లోతట్టు ప్రాంతాలలోని ఇళ్ళలోకి నీరు చేరింది.

జాతీయరహదారిపై రాకపోకలు నిలిపివేత..

పదహారో నంబరు జాతీయ రహదారి కొత్త బైపాస్ మార్గం తిమ్మాపురం అండర్ పాస్ మార్గంలో వరద నీరు సుమారు ఐదు అడుగుల మేర ప్రవహించడంతో బుధవారం ఉదయం ఐదు గంటల నుంచి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీనితో చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అప్పటికే ఒక జీపు దారి తప్పి రోడ్డు పక్కన నీటిలో ఇరుక్కుపోయింది. హైవే పోలీసులు, స్థానికులు, నీటిలో ఇరుక్కుపోయిన జీపుకు తాడుకట్టి మరో వాహనంతో ఒడ్డుకు లాగారు.

పరిశీలించిన కలెక్టర్ కృతికాశుక్లా

కలెక్టర్ కృతికాశుక్లా నియోజకవర్గంలోని పలు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ క్రమంలో తిమ్మాపురం బైపాస్ అండర్‌పాస్‌ను వరద నీరు ముంచెత్తిన ప్రాంతాన్ని అధికారులతోకలసి పరిశీలించారు. వరద నీరు అండర్‌పాస్‌గుండా ప్రవహిస్తుండడాన్ని పరిశీలించిన వరదనీరు అటుగా రావడటంపై స్థానిక రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైవే అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే సమస్య ఉత్పన్నమైందని, నక్కవాగులోకి వరదనీరు పోయేలా డ్రెయిన్‌లు నిర్మించకపోవడంతో వరదనీరు అంతా అండర్‌పాస్ గుండా ప్రవహిస్తోందని, అంతేగాకుండా పంట పొలాలను ముంచెత్తుతున్నదని కలెక్టర్‌కు తెలిపారు. బైపాస్‌కు దక్షిణంవైపున కృష్ణమూర్తి డొంకపక్కగా 30 అడుగులతో బైపాస్ మార్గం ఉత్తరం వైపు వరకు, అక్కడి నుంచి నక్కవాగు వరకు వరదనీరు పోయేలా డ్రెయిన్ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. వరద నీరు పంట పొలాల్లోకి వెళ్లకుండా నక్కవాగులోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని హైవే కాంట్రాక్టర్ మురళీకృష్ణను ఆదేశించారు.

● ఈపూరు, తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటల నష్టతీవ్రతను అంచనా వేసి నివేదికను పంపించమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే రెవెన్యూ అధికారులను కోరారు. ఈపూరు మండలంలో తుఫాన్‌కు దెబ్బతిన్న పైర్లను బుధవారం ఆయన పరిశీలించారు. కొచ్చెర్ల, శ్రీనగర్ వద్ద దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన జేసీ రైతులతో మాట్లాడారు. వినుకొండ ఏడీఏ సీహెచ్ రవికుమార్ నేలవారిన వరి పైరును పరిశీలించారు. పంటలను పరివీలించిన వారిలో తహసీల్దారు ఏ నళిని, మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు, ఎంపీడీవో ఉమాదేవి, ఆర్ఐ పీ రామారావు, పంచాయతీ సెక్రటరీ తిరుపతయ్య, వీఆర్వో సాయి, సొసైటీ డైరెక్టర్ ఎ.కోటేశ్వరరావు, నిశ్శంకరరావు అంకారావుఉన్నారు.

● వినుకొండ టౌన్: మొంథా తుఫాను తాకిడికి నియోజకవర్గంలో పలు గ్రామాలతో పాటు వాగులు, వంకలు జలమయమయ్యాయి. వినుకొండ మున్సిపల్ అధికారులతో పాటు, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమన్వయంతో లోతట్టు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలించారు. బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని అరుంధతి కాలనీ, రజక కాలనీలో చెక్కవాగు ఉధృతంగా ప్రవహించి వర్షపునీరు నివాస గృహాల్లోకి ప్రవేశించడంతో అధికారులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని ఆర్టీసీ బస్సుల ద్వారా నిర్మలా స్కూల్లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. పిట్టంబండ, ఉమ్మడివరం సమీపంలోని మల్లెడ వాగు ఉధృతంగా ప్రవహించడంతో పోలీస్, రెవెన్యూ సిబ్బంది సంఘటనా ప్రాంతంలోని వారికి రక్షణ చర్యలు చేపట్టారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే నిర్మలా స్కూల్లోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి వినుకొండకు తాగునీరు అందించే సింగరచెరువును పరిశీలించారు. మొంథా తుపాను కారణంగా పట్టణంలోని అరుంధతి కాలనీ, మిద్దెబావి, శివప్రసాద్ కాలనీ, హనుమాన్‌నగర్, రజకకాలనీ, మండలంలోని పిట్టంబండ ఎస్టీ కాలనీ, ఉమ్మడివరం ఎస్టీ కాలనీ, పెరుమాళ్లపల్లి, ఏనుగుపాలెం, తదితర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేశారు. ఇదిలా ఉండగా ఉమ్మడివరం మల్లెడవాగు ప్రవాహ ఉధృతితో రాకపోకలు నిలిచి పోయాయి.

● బొల్లాపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న మొంథా తుఫాన్ ప్రభావంతో బొల్లాపల్లి మండలంలో పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోలకు నిలిచిపోయి రవాణా వ్యవస్థ స్తంభించింది. వినుకొండ - గుంట్లపల్లి రహదారిలో వెల్లటూరు వద్ద చప్పిడి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మంగళవారం రాత్రి నుంచే రాకపోకలు ఆగిపోయాయి. బొల్లాపల్లి నుంచి లక్ష్మీపురం తండాకు వెళ్ళే రహదారిలోని కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ఈ రహదారి గుండా బొల్లాపల్లికి వెళ్ళే తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. సహాయక చర్యల్లో బొల్లాపల్లి ఎస్ఐ షేక్ సమీర్, రెవెన్యూ అధికారులు తహసీల్దార్ ఏ సుధాకర్, వీఆర్వో, ఎంపీడీవో పీ మాధురి, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది వాగుల వద్ద ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు.

● నాదెండ్ల: మండల పరిధిలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు సుమారు 15 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. వర్షంతో పాటు వీచిన గాలులకు పత్తి, ఇతర పంటలు నీట మునిగాయి. కుప్పగంజి వాగు ఉధృతికి కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం, గణపవరం తదితర గ్రామాల్లోని పొలాలు నీట మునిగాయి. గణపవరం గ్రామంలో యానాదుల ఇళ్ళు, చెవిటిపాలెంలోని పలు ఇళ్ళు నీట మునగటంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. తహసీల్దార్ కుటుంబరావు, ఎంపీడీవో స్వరూపరాణి, ఎస్ఐ పుల్లారావులు పలు గ్రామాలను సందర్శించి చర్యలు చేపట్టారు.

● రొంపిచర్ల: మండలంలోని ఓగేరు వాగు పరివాహక ప్రాంతాలు వర్షపు నీటితో బ్రిడ్జిలపై నుంచి ప్రవహిస్తున్నాయి. మాచవరం, మునమాక, అన్నవరం, ముత్తనపల్లి గ్రామాల వద్ద ఓగేరు వాగు బ్రిడ్జిలపై నుంచి ప్రవహిస్తోంది. మునమాక, మాచవరం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. మునమాక వద్ద బ్రిడ్జికి ఇరువైపులా ముళ్ళ కంచెను వేశారు. సంతగుడిపాడులో వర్షపు నీటిని గృహాల్లో నుంచి బయటకు పంపించేందుకు టీడీపీ నాయకులు కోంద్రు శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావులు సహాయక చర్యలు చేపట్టారు. విప్పర్లపల్లిలోని బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి అడ్డు పడిన తూటు కాడను జేసీబీ సహాయంతో తొలగించారు. తహశీల్దార్ నిర్మల ఎప్పటికప్పుడు సహాయక చర్యలను తీసుకుంటున్నారు.

● శావల్యాపురం: మండలంలోని చిన్నకంచెర్ల నుంచి పిచికలపాలెం మధ్యనున్న వంతెన పైనుండి వర్షపునీరు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలానే కారుమంచి నుండి వయ్యకల్లు వెళ్ళే దారిలో వాగు ఉప్పొంగి వంతెనపై నుండి వర్షపునీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పిచికలపాలెం నుండి వినుకొండకి వెళ్ళే మార్గంలో ఆర్‌యూబీలోకి వర్షపునీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

● ఈపూరు: మండలంలోని కొచ్చెర్ల, కొండాయిపాలెం, శ్రీనగర్ గ్రామాలలో సాగు చేసిన కేఎన్ఎం వరి వంగడం ప్రస్తుతం కంకిదశలో ఉండడంతో వరి పైరు నేలకు వాలింది. దీంతో గింజ చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. కొంద్రముట్ల వద్ద చింతచెట్లు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి.

● నూజెండ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో 98.8 మిల్లీ మీటర్ల వర్షం పాతం బుధవారం ఉదయానికి నమోదైంది. గుండ్లకమ్మ నది, వల్లేరు వాగులు ఉధృతంగా ప్రవహించటంతో వినుకొండ - కురిచేడు, వినుకొండ - ఉల్లగల్లు, వినుకొండ - ఈదర మార్గాల్లో పల్నాడు, ప్రకాశం జిల్లాలకు వాహనాల రాకపోకలు నిలిచి పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వినుకొండ: కంచర్ల ఎస్సీ కాలనీ సమీపంలో గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, తహసీల్దార్ సురేష్



నూజెండ్ల: గుండ్లకమ్మ నది వద్ద సూచనలు చేస్తున్న జేసీ సూరజ్



తిమ్మాపురం బైపాస్ మార్గంలోని అండర్‌పాస్ వద్ద నీటి ప్రవాహంలో నిలిచిపోయిన జీపు



బొల్లాపల్లి: భారీగా కోతపడిన లక్ష్మీపురం తండా రహదారి



యడ్లపాడు: చెంఘీజ్‌ఖాన్‌పేట వద్ద నీట మునిగిన పత్తి పొలాలు



యడ్లపాడు: దింతెనపాడు ఎస్సీ కాలనీని ముంచెత్తిన వర్షపు నీరు



యడ్లపాడు-జగ్గాపురం మార్గంలో అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభం



నూజెండ్ల యోగిరెడ్డిపాలెం వద్ద అండర్ బ్రిడ్జిలోకి ప్రవహిస్తున్న వర్షపు నీరు



రొంపిచర్ల: విప్పర్లపల్లిలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూటుకాడను తొలగిస్తున్న జేసీబీ



నాదెండ్ల: కుప్పగంజి ఉధృతికి ఇళ్లలోకి చేరిన నీరు



నాదెండ్ల: ఎండుగు పాలెంలో కూలిన భారీ వృక్షం



నూజెండ్ల జడ్పీ పాఠశాల పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మధులత